సాక్షి అనకాపల్లి

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



గంజాయి నిర్మూలన

గంజాయి నిందితులపై ఉక్కుపాదం మోపాలని నెలవారీ సమీక్ష సమావేశంలో ఎస్పీ గౌతమి సాలి ఆదేశించారు. 8లో



వేడెక్కుతున్న మన్యం

పాడేరు: ఏజెన్సీలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. బుధవారం అరకులోయలో 15.3, చింతపల్లిలో 17 డిగ్రీలు నమోదయ్యాయి.

14 అడుగుల పుట్ట



హుకుంపేట: మత్స్యపురం పంచాయతీ బంగారుమెట్టలో సుమారు 14 అడుగులకు పైబడి ఎత్తు ఉన్న ఓ పుట్ట ఆకర్షిస్తోంది. సహజంగా 4 అడుగుల ఎత్తు వరకు మాత్రమే పుట్టలు ఉంటాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షుల నియామకం

సాక్షి, అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. బుధవారం ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా యూత్‌వింగ్ అధ్యక్షుడిగా పల్లిశెట్టి సురేష్‌రాజ్ (పెందుర్తి), మహిళా విభాగం- ఈర్లె అనురాధ (మాడుగుల), రైతు విభాగం-ఎర్రా అప్పారావు (మాడుగుల), బీసీ సెల్ -పైల రమేష్ (పాయకరావుపేట), ఎస్సీ సెల్-లోచెల సుజాత (నర్సీపట్నం), ఎస్టీ సెల్- సోలాం రమేష్ (మాడుగుల), మైనారిటీ సెల్-తాజుద్దీన్‌బాబా, పబ్లిక్ వింగ్-దగ్గుపల్లి సాయిబాబా (పాయకరావుపేట), పంచాయతీరాజ్ వింగ్-గొర్లె సూరిబాబు (అనకాపల్లి), వికలాంగుల విభాగం-జె.వెంకటరవికుమార్ (చోడవరం), కల్చరల్ వింగ్- జె.అప్పలరాజు (యలమంచిలి), క్రిస్టియన్ మైనారిటీ - బిషప్ మహంతి(చోడవరం), వైఎస్సార్ సేవాదళ్- పల్లా నరసింగరావు (చోడవరం), డాక్టర్స్ వింగ్- డాక్టర్ బండారు సత్యనారాయణ (చోడవరం), కల్చరల్ వింగ్-జామీశివ అప్పలరాజు (యలమంచిలి), వైఎస్సార్‌టీయూసీ-లాలం బంగారి నాయుడు (పెందుర్తి), స్టూడెంట్ వింగ్-కొప్పిశెట్టి అప్పారావు (పాయకరావుపేట), వీవర్స్ వింగ్-కొమ్మన వెంకటేశ్వరరావు (యలమంచిలి), గ్రీవెన్స్ సెల్-డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి (అనకాపల్లి) నియమించారు. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కోఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

7న అప్పన్న డోలోత్సవం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: పాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని వచ్చే నెల 7న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటల సమయంలో సింహగిరి నుంచి స్వామిని కొండదిగువకి తీసుకొచ్చి పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపంలో డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహిస్తామన్నారు. ఆ రోజు సింహగిరిపై స్వామివారి నిత్యకల్యాణం రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో మామోగ్రఫీ పరీక్షలు

విశాఖ: రొమ్ము క్యాన్సర్‌ను నిర్ధారించే రూ.2.50 కోట్ల విలువ గల మామోగ్రఫీ డిజిటల్ టోమోసింథసిస్ కేజీహెచ్‌లో అందుబాటులో ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 45 ఏళ్లు నిండిన స్త్రీలు ఉచితంగా పరీక్షలు చేసుకోవచ్చని.. కేజీహెచ్ ఆవరణలోని 29 నంబర్ గదిలో రేడియాలజీ డిపార్టమెంట్‌ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఏయూలో 'ఫార్మా' సదస్సు



ఏయూక్యాంపస్: ఏయూలో అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యూఎస్ ఎఫ్‌డీఏ) సంస్థ రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి తెలిపారు. వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో గురువారం ఉదయం 9 గంటలకు 'కరెంట్ గుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్' అంశంపై సదస్సు ప్రారంభమవుతుందన్నారు. యూఎస్ డ్రగ్ రెగ్యులేటరీ వ్యవస్థ ఎఫ్‌డీఏ డ్రగ్ క్వాలిటీ డివిజన్ డైరెక్టర్ కార్మిలో రోసా హాజరై కీలకోపన్యాసం చేస్తారని చెప్పారు.

మహిళా పోలీస్ సంక్షేమ సంఘం కార్యవర్గం



జి.కుసుమశ్రీకుమారి

అనకాపల్లి టౌన్: గ్రామ, వార్డు సచివాలయాల మహిళా పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు బుధవారం గుంటూరులో జరిగాయి. అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలిగా జి.కుసుమశ్రీ కుమారి, ప్రధాన కార్యదర్శిగా కనిశెట్టి ఉమ, కోశాధికారిగా జి.వరలక్ష్మి, మరో 21మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

అభివృద్ధి, సంక్షేమమే విజయానికి సోపానాలు

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం వైఎస్సార్ సీపీదే..
- పార్టీ ముఖ్య నేతల స్పష్టీకరణ
- నామినేషన్ దాఖలు చేసిన పార్టీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్
- వేంకటేశ్వర స్వామి, సంపత్ వినాయక ఆలయల్లో ప్రత్యేక పూజలు
- 5 కి.మీ మేర వందలాది మంది పార్టీ శ్రేణులతో ర్యాలీ



విశాఖ కలెక్టరేట్ బయట మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్, చిత్రంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, ఉప ముఖ్యమంత్రులు ముత్యాలనాయుడు, రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు సోపానాలుగా నిలుస్తాయని టీటీడీ చైర్మన్, పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్ తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు రుషికొండలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, సంపత్ వినాయక ఆలయంలో పూజలు చేశారు. వందలాదిమంది వైఎస్సార్ సీపీ శ్రేణులతో ఐదు కిలోమీటర్ల మేర కార్లు, బైక్‌లతో ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్న దొర, మంత్రి బొత్స సత్యనారాయణ సమక్షంలో సుధాకర్ నామినేషన్ పత్రాలను కలెక్టర్ మల్లికార్జునకు అందించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్టీలకతీతంగా, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు పారదర్శకంగా పాలన అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న అభిమానాన్ని ఈ ఎన్నికల్లో ఓట్ల రూపంలో చాటుకోవాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే లక్షలాది మంది యువతకు సచివాలయం వ్యవస్థ ద్వారా ఉపాధి కల్పించామన్నారు. యువత భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు చేపట్టిందన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు ప్రాధాన్యమిస్తున్నారని.. పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తించి పార్టీ అభ్యర్థి విజయానికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ నాలుగేళ్ల ప్రభుత్వ పాలనను పట్టభద్రులకు వివరించి ఓట్లు అడుగుతామన్నారు. లబ్ధి పొందిన ప్రతీ పట్టభద్రుడు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, వేణుగోపాల కృష్ణ, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, సమన్వయకర్తలు అక్కరమాని విజయనిర్మల, ఆడారి ఆనంద్, నియోజకవర్గ పరిశీలకులు డి.వి సూర్యనారాయణ రాజు, బొడ్డేడ ప్రసాద్, చిక్కాల రామారావు, రొంగలి జగన్నాథం, డిప్యూటీ మేయర్‌లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజబాబు, కార్పొరేషన్ చైర్మన్లు జాన్‌వెస్లీ, పిల్లా సుజాత, ఫుడ్ కార్పొరేషన్ కమిషన్ సభ్యుడు కాంతారావు, వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు మొల్లి అప్పారావు, శివప్రసాద్, గొలగాని శ్రీనివాస్, ఐహెచ్ పరూఖీ, తుల్లి చంద్రశేఖర్, పేర్ల విజయచందర్, శ్రీదేవివర్మ, కలిదిండి బద్రినాథ్, బోని శివరామకృష్ణ, శ్రీదేవివర్మ, అంగ రాంప్రసాద్, వార్డు అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఒక్క రోజే 12 నామినేషన్లు

- ఇప్పటివరకు మొత్తం 18 దాఖలు
- నేడే చివరి రోజు



టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు నామినేషన్



బీజేపీ అభ్యర్థిగా పీవీఎన్ మాధవ్.



టీడీపీ రెబల్ ఈర్లె శ్రీరామ్మూర్తి నామినేషన్

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు బుధవారం 12 మంది జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్, టీడీపీ మద్దతు అభ్యర్థిగా వేపాడ చిరంజీవిరావు, బీజేపీ మద్దతు అభ్యర్థిగా పి.వి.ఎన్.మాధవ్ నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ రెబల్ అభ్యర్థిగా ఈర్లె శ్రీరామమూర్తి దిగారు. స్వతంత్ర అభ్యర్థులుగా విజయనగరం జిల్లా రాజాంకి చెందిన పురిపండ శ్రీనివాసరావు, విశాఖ జిల్లా సీబీఎం కాంపౌండ్‌కు చెందిన గుండుపల్లి సతీష్, వేపగుంటకు చెందిన దండేల ఆనందరావు, ఆరిలోవకు చెందిన బలివాడ రామ సంతోష్, మధురవాడకు చెందిన జి.విజయకుమార్, అనకాపల్లి జిల్లా గవరపాలెంకి చెందిన ఆడారి శరత్ చంద్ర, శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన కాళ్ల లోకనాథం, మొలియాపుట్టికి చెందిన రాజానమోహన్ రావు నామినేషన్లు దాఖలు చేశారు. మొత్తంగా బుధవారం నాటికి 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

జాడలేని జనసేన

సాక్షి, విశాఖపట్నం: జనసేనతో పొత్తు కొనసాగుతోందని పదేపదే చెప్పుకుంటున్న బీజేపీ నేతలకు జనసేన శ్రేణులు ఝలక్ ఇచ్చాయి. ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీవీఎస్ మాధవ్ నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో జనసేన నాయకులు గాని, కార్యకర్తలు గాని జాడ లేకుండా పోయారు. నామినేషన్ వేసేందుకు పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరే సమయంలో గాని, ర్యాలీలో గాని, కలెక్టరేట్‌లోగాని జనసేన నేతలు కనిపించలేదు. జనసేన జెండాలు అగుపించలేదు. అయితే మాధవ్ మాత్రం ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికలకు జనసేన పార్టీతో కలిసే ముందుకు వెళ్తామని చెప్పడం కొసమెరుపు. బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు తదితరులు మాధవ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీ ర్యాలీలో కోచింగ్ సెంటర్ విద్యార్థులు

మహారాణిపేట: తెలుగుదేశం మద్దతు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావు నామినేషన్ ర్యాలీని తెలుగుదేశం నాయకులు పెద్దగా పట్టించుకోలేదు. జన సమీకరణకు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో అభ్యర్థే చోడవరం నుంచి జనాలను తెప్పించుకున్నారు. ఆయన పనిచేస్తున్న కోచింగ్ సెంటర్ నుంచి విద్యార్థులను తీసుకొచ్చారు. వచ్చిన వారితో పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. కలెక్టర్ మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు అందించారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల తరఫున గళం వినిపించేందుకు తనకు ఓ అవకాశం ఇవ్వాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, నాయకులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి కొండ్రు మురళీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆదాయం పెంపునకు కృషి



మాట్లాడుతున్న స్నైల్ అడిషనల్ డైరెక్టర్ సింహాచలం

ఆరిలోవ (విశాఖ తూర్పు): పాడి పశువుల ఉత్పాదకత పెంపుదలకు కృషి జరుగుతోందని రాష్ట్ర పశుగణ వ్యవస్థాపకత యాజమాన్య సంస్థ (స్నైల్) అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యాండ్రప్ప సింహాచలం తెలిపారు. విమ్స్ సమీపంలోని రాష్ట్ర స్నైల్ కార్యాలయంలో అన్ని జిల్లాలలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లకు మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఈ శిక్షణలో రోజుకు 35 నుంచి 40 మంది వరకు పశు వైద్యులకు బ్యాచ్‌లవారీగా శిక్షణ ఇచ్చారు. పాడి పశువులకు ఆధునిక పోషణ పద్ధతులు, వాటి ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెంచడం, పాడి రైతులకు ఆదాయం పెంచే చర్యలు తదితర అంశాలను అధికారులు వివరించారు. దీంతో పాటు పశు వైద్యులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్నైల్ అదనపు డైరెక్టర్ సింహాచలం మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు ఇక్కడ 1,117 మంది పశు వైద్యులకు, 80 మంది సన్న జీవాల వ్యవస్థాపకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, కర్నూలు, తిరుపతి, అనంతపురం ప్రాంతీయ శిక్షణ కేంద్రాలలో వైద్యులకు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ శిక్షణలో తెలుసుకొన్న అంశాలు, ఆధునిక పద్ధతులను గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాడి రైతులు డెయిరీ ఫారాలు ఏర్పాటు చేసుకోవడానికి, డెయిరీలలో ఎక్కువ సంఖ్యలో పశువులు ఉండే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. పాల ఉత్పత్తి పెంచే విధంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. రైతులకు ప్రోటీన్‌లతో కూడిన దానా అందించే చర్యలు చేపడుతున్నామన్నారు. ముగింపు కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మురళీధర్, చక్రవర్తి, రమణయ్య, సుధాకర్, ప్రసాదరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అద్భుత ఆవిష్కరణల వేదిక

- జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం
- విద్యార్థుల సృజనాత్మక శక్తికి పదును
- బాలల ప్రతిభకు కలెక్టర్ ప్రశంసలు



విద్యార్థి నుంచి ప్రాజెక్టు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



బాలికల సాంస్కృతిక ప్రదర్శన

అనకాపల్లి టౌన్: అబ్బురపరిచింది.. అద్భుతాలు ఆవిష్కరించింది.. జీవీఎంసీ ఉన్నత పాఠశాల (మెయిన్)లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థుల సృజనకు వేదికగా నిలిచింది. ఈ ప్రదర్శనను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బుధవారం ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న సైన్స్ ఫెయిర్‌లో జిల్లావ్యాప్తంగా ఐదు అంశాల్లో 24 మండలాల నుంచి ఐదు చొప్పున మొత్తం 120 ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులు, గైడ్ టీచర్లు ఉదయం 7 గంటలకే వేదిక వద్దకు చేరుకుని సమోదు చేసుకున్నారు. వేదిక పరిసరాలు విద్యార్థులు, ఉపాధ్యాయులతో నిండిపోయాయి. పాఠశాల ఆవరణలో పండగ వాతావరణం కనిపించింది. ప్రతి అంశానికి ప్రత్యేక గదులను ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఆవిష్కరణలు వారి సృజనాత్మక ఆలోచనలను ప్రతిబింబించే విధంగా ఉన్నాయి.

ముగ్ధులైన కలెక్టర్

విద్యార్థుల ఆవిష్కరణలను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఓపికగా పరిశీలించారు. ప్రతి గదిలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను తిలకించి, వారి ఆలోచనలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వివరించిన తీరును చూసి వారిని మెచ్చుకున్నారు. మొత్తం అన్ని ప్రాజెక్టులను పరిశీలించి వారిలో ఉత్సాహం నింపారు. ప్రాజెక్టులను మరింతగా అభివృద్ధి చేయాలని సూచించారు. నూతనంగా ఆలోచించాలన్నారు. డిప్యూటీ డీఈవో డాక్టర్ ఎస్.ప్రేమ్‌కుమార్, ఏడీ రవిబాబు, జిల్లా సైన్స్ ఆఫీసర్ కప్పల ప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థులకు వసతితో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు జరిగాయి.

అప్పికొండ వద్ద డీశాలినేషన్ ప్లాంట్



ఆయా సంస్థల ప్రతినిధులతో సమావేశమైన కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: అప్పికొండ వద్ద 100 ఎంఎల్డీ డీశాలినేషన్ ప్లాంట్‌ను పీపీపీ పద్ధతిలో నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్(ఏపీయూఐఏఎంఎల్), ఐడీఈ టెక్నాలజీస్ ప్రతినిధులు చేతన్, శ్రీనివాస్ బుధవారం జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబును తన కార్యాలయంలో కలిసి చర్చలు జరిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని కమిషనర్ వారికి తెలిపారు. సమావేశంలో ప్రధాన ఇంజనీరు రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజనీరు కె.వి.ఎన్.రవి, ఐడీఈ టెక్నాలజీస్ ప్రతినిధి సైన్షా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వేడుకగా ఉపమాక వెంకన్న పెళ్లిరాట

- వచ్చే నెల 3న స్వామివారి కల్యాణం
- ఉత్సవాలకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు



ఉపమాకలో స్వామివారి కల్యాణానికి పెళ్లి రాట వేస్తున్న అర్చక స్వాములు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం, తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల కోసం బుధవారం పెళ్లి రాట ప్రతిష్ఠించారు. ఉదయం 7.58 గంటలకు టీటీడీ ఆగమ శాస్త్రానుసారం దేవస్థాన అర్చకులు స్వామివారి వివాహ వేడుకలకు శ్రీకారం చుట్టారు. గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన వేంకటేశ్వరస్వామివారి వార్షిక తిరుకల్యాణోత్సవాలు వచ్చే నెల 3వ తేదీ నుంచి అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ముందుగా స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆలయంలో ఉన్న ధ్వజస్తంభం వద్ద పెళ్లి రాట వేశారు. మార్చి 2వ తేదీన అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 3న స్వామివారి వార్షిక కల్యాణం జరుగుతుందని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. ఆరోజు ముందుగా స్వామివారికి ఉపమాక సింహాద్రాచార్యులు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవం, కన్యావరుణ సంవాదం (స్వామివారికి, అమ్మవారికి పెళ్లిమాటల కార్యక్రమం) జరుగుతుందన్నారు. అనంతరం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తారన్నారు. తదుపరి స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని వేలాదిమంది భక్తుల సమక్షంలో గాలిగోపురం ఎదురుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్ద నిర్వహిస్తామన్నారు. నాలుగో తేదీ రాత్రి హంస వాహనంపై తిరువీధి సేవ, ఐదో తేదీ రాత్రి సదస్యం, పండిత సభ, ఆరో తేదీన తోట ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ఏడో తేదీన ఆలయంలో మహాపూర్ణాహుతి, అనంతరం మధ్యాహ్నం స్వామివారి ఉత్సవమూర్తులకు రాజయ్యపేట సముద్రతీరంలో చక్రవారీ స్నానం, ప్రత్యేక తిరుమంజన సేవ నిర్వహిస్తామన్నారు. 8, 9, 10 తేదీల్లో రాత్రి వరుసగా మూడు రోజు పుష్పయాగోత్సవాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. పెళ్లిరాట ఉత్సవంలో ఆలయ అర్చక స్వామి సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, శివాలయం చైర్మన్ సిహెచ్ వెంకటేశ్వరరావు, శ్రీనివాస భక్త సమాజం సభ్యులు పాల్గొన్నారు.

నెలలు నిండక.. ప్రాణం నిలవక

- పుట్టిన రెండో రోజే మరణించిన పసికందు
- రోడ్డు కష్టాలే కారణం
- ఆటోతో వైద్యురాలు చేరుకున్నా దక్కని బిడ్డ ప్రాణం



మృతి చెందిన శిశువుతో తల్లిదండ్రులు కమల, ససేన్

రోలుగుంట: గర్భం దాల్చినట్టు తెలిసినప్పటి నుంచి పుట్టబోయే బిడ్డపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తమ కలల పంట రాక కోసం నిరీక్షించారు. అయితే నెలలు నిండక ముందే కాన్పు కావడంతో వారి ఆశలు అడియాసలయ్యాయి. ఐదో నెల్లోనే పుట్టిన పాపను చికిత్స కోసం ఆస్పత్రికి చేర్చేందుకు వారు చేసిన ప్రయత్నాలు, ఆస్పత్రి వైద్యురాలి శ్రమ, స్థానికుల సాయం ఫలించలేదు. దీంతో పుట్టిన రెండో రోజే ఆ తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చి పాప చనిపోవడంతో రోలుగుంట మండలంలోని అర్ల గిరిజన పంచాయతీ పెదగరువుకొండపై విషాదం అలముకుంది.

అర్లకు చెందిన కిలో ససేన్ భార్య కమల ఐదో నెలలోనే మంగళవారం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే నెలలు నిండకుండా పుట్టిన ఈ బిడ్డకు మెరుగైన వైద్యం అందించాలని తల్లిదండ్రులు బుధవారం నిర్ణయించుకున్నారు. రోడ్డు వసతి లేని ఆ గ్రామం నుంచి బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ససేన్ మరొకరి సాయంతో డోలీమోతతో కొండపై నుంచి వైబీ పట్నంకు బయలుదేరారు. అక్కడి నుంచి ఆస్పత్రి ఇంకా ఆరు కిలోమీటర్లుండటంతో 108కి కాల్ చేశారు. మరోవైపు బుచ్చింపేట ఆస్పత్రి వైద్య సిబ్బందికి కూడా పాపను తీసుకొస్తున్నట్టు సమాచారం అందించారు. కొండ దిగేసరికి 108 వచ్చే అవకాశం లేకపోవడంతో వైద్యురాలు సునీత ఆటోలో వైబీ పట్నం వచ్చి, అక్కడి నుంచి పసికందును ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే పాప మరణించింది. ఇందరు ప్రయత్నించినా.. పాప దక్కలేదన్న విషయం తెలియడంతో ఆ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. దీనిపై వైద్యురాలు విలేకరులతో మాట్లాడుతూ కమల ఆరోగ్యం పరవాలేదని, మూడు రోజుల పాటు వైద్యం అందిస్తామన్నారు. దీనిపై సీపీఐ జిల్లా నాయకుడు గోవింద మాట్లాడుతూ రహదారి సౌకర్యం లేకనే కొండపైనున్న గిరిజనులకు డోలీ మోతలు తప్పడం లేదన్నారు.

హిల్‌టాప్ గ్రామమది..

అత్యంత ఎత్తులో ఉన్న హిల్‌టాప్ గ్రామమైన అర్ల (పెదగరువు కొండ) సమీపంలోనున్న శరభవరంలో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. కమలకు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ వర్కర్ పౌష్టికాహారం అందించారు. గర్భ నిర్ధారణ జరిగాక రెండు మాసాలు ఆస్పత్రికి వెళ్లిన కమల, ఆ తర్వాత రెగ్యులర్ చెకప్‌లకు వెళ్లలేదు. దీంతో గర్భంలో వచ్చిన మార్పులు, అందుకనువైన చికిత్స చేసే అవకాశం లేకపోయింది. అందుకే నెలలు నిండకుండానే ప్రసవం జరిగి ఉంటుందని వైద్యులు భావిస్తున్నారు.

క్లుప్తంగా

అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు సీజ్


దేవరాపల్లి పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు

దేవరాపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ డి. నాగేంద్ర తెలిపారు. మండలంలోని తామరబ్బ, చింతలపూడి పంచాయతీల పరిధిలోని శారదా నదిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఆయన తెలియజేశారు. ఈ ఇసుక తరలిస్తూ పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతి


మృతుడు దాదమ్మ

నక్కపల్లి: మండలంలో ఉపమాక పంచాయతీ కొత్రవాని పాలెం గ్రామానికి చెందిన దొంగల దాదమ్మ (53) బుధవారం కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తూ జారి కింద పడ్డాడు. తీవ్రగాయాలయిన అతన్ని కుటుంబ సభ్యులు వైద్యం కోసం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర వైద్యం కోసం కాకినాడ తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడి భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

మాకవరపాలెం: కత్తితో దాడి చేసిన ఒకరిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన పోతల కొండబాబు (32)కు పెంపుడు కుక్కలు ఉన్నాయి. ఇవి అటుగా వెళ్లే వాహనాలకు అడ్డంగా వస్తున్నాయని గ్రామస్తులు కన్నూరు సత్తిబాబు, లగుడు సత్యనారాయణ ప్రశ్నించడంతో మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో కొండబాబు కత్తితో ఇద్దరిపై దాడి చేశాడు. గాయాలైన వీరు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొండబాబుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ బుధవారం తెలిపారు.

వెల్లివిరిసిన సృజన

అద్భుత ఆవిష్కరణలతో ప్రతిభ చాటిన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: విద్యార్థులకు అవకాశం ఇవ్వాలే కాని.. వారు తమలోని ప్రతిభను ఇట్టే నిరూపించుకుంటారు. ప్రశ్నించిడం, శోధించడం అలవాటు చేస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారు. అందుకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జాతీయ వైజ్ఞానిక దినోత్సం సందర్భంగా పిల్లల్లో దాగి ఉండే సృజనను వెలికి తీస్తోంది. అనకాపల్లి జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలను జీవీఎంసీ ఉన్నత పాఠశాల (మెయిన్)లో బుధవారం నిర్వహించారు. వివిధ మండలాల నుంచి విచ్చేసిన విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి అద్భుతమైన ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించారు.

రాత్రివేళల్లో స్వచ్ఛమైన గాలి


స్వచ్ఛమైన గాలినిచ్చే మొక్కలతో విద్యార్థినులు

సాధారణంగా మొక్కలు ఉదయం ఎక్కువగా ఆక్సిజన్ విడుదల చేస్తాయి. రాత్రిపూట ఆక్సిజన్ శాతం తక్కువగా ఉంటుంది. అలా కాకుండా రాత్రి పూట కూడా ఎక్కువగా ఆక్సిజన్‌ను విడుదల చేసే మొక్కలను పెంచుకోవడం వల్ల అటు పర్యావరణ పరిరక్షణ, మరోవైపు స్వచ్ఛమైన గాలిని పొందవచ్చు అనేది ఈ ప్రాజెక్టు ఉద్దేశం. క్రాషిలేషన్ యాసిడ్ మెటబాలిజమ్ సిస్టమ్ ద్వారా కొన్ని ఇంటి లోపల పెంచే మొక్కలు ఉదయం పూట స్టొమాటాను మూసి ఉంచి రాత్రి పూట స్టొమాటా ఓపెన్ చేయడం ద్వారా అందులో నిల్వ ఉన్న నీరు విభజన చెంది ఎక్కువ ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. పీస్‌లిల్లీ, స్నేక్ ప్లాంట్, రబ్బర్ ప్లాంట్, స్పైడర్ ప్లాంట్, చైనీస్ ఎవర్ గ్రీన్, అరేకా పామ్, ఫెర్న్స్ వంటి మొక్కలు ఇందుకు ఉపయోగపడతాయి.

– జి.సౌజన్య, ఎం.లౌక్య, గైడ్ టీచర్: శ్రీకృష్ణ, జెడ్పీహెచ్ఎస్, వేచలం

సోలార్ సైకిల్



సోలార్ ప్యానెల్ ద్వారా చార్జింగ్ బ్యాటరీ అమర్చి సైకిలు రిమ్‌కు ఉన్న మోటారును రన్ చేయడం ద్వారా సైకిల్‌ను మోటారు బైక్ మాదిరిగా వినియోగించవచ్చు.

– అఖిల్ రూపేష్, జెడ్పీహెచ్ఎస్, బూరుగుపాలెం

నిత్య జీవితంలో గణితానికి ప్రాధాన్యం


మ్యాథమెటిక్స్ ఉపయోగాలు వివరిస్తున్న విద్యార్థిని

దూరాలను అంచనా వేయడం, కొండలు, పర్వతాల ఎత్తులను నిర్ధారించడం, విమానాల దారి కనుగొనడం, రహదారులు, భవనాల నిర్మాణం, సముద్రాలు, నదులు, కొలనుల లోతు కనుగొనడానికి గణితం ఉపయోగపడుతుంది. దీని నమూనాకు రూ.5,000 ఖర్చు అవుతుంది.

– ఎ.లిఖిత, గైడ్ టీచర్ పి.స్వర్ణగౌరి, జెడ్పీహెచ్ఎస్, పెదముషిడివాడ

పర్యావరణంతో స్నేహం

నిత్యజీవితంలో ప్లాస్టిక్‌తో కాలుష్యం పెరిగిపోతోంది. దీన్ని నివారించడానికి పర్యావరణ హితంగా మనిషి ఆలోచించాలి. రీయూజ్–రెడ్యూస్–రీసైకిల్–రికవరీ అనే విధానాలు ఉపయోగించడం వల్ల ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించవచ్చు అనే విషయాన్ని ఇందులో వివరించాం.

– సుమంత్, గైడ్ టీచర్: ఎంఎస్ లత, జెడ్పీహెచ్ఎస్, లాలంకోడూరు



భూగర్భంలో కాలుష్య నివారణ


కాలుష్య నివారణపై వివరిస్తున్న విద్యార్థి

భూగర్భం ద్వారా పరిశ్రమల నుంచి వెలువడే వాయు కాలుష్యాన్ని నిర్మానుష్య ప్రదేశాలకు పంపించి అక్కడ మొక్కలు పెంచడం దార్వా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయొచ్చు. ఇందులో సోలార్ సిస్టమ్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు.

– బి.రాజ్‌కుమార్ (9వ తరగతి), గైడ్ టీచర్: నాగేశ్వరరావు, జెడ్పీ ఉన్నత పాఠశాల, ఆర్ఎస్ రోడ్డు.

పైథాగరస్‌తో సమస్యల పరిష్కారం


పైథాగరస్ సిద్ధాంతం గురించి చెబుతున్న విద్యార్థిని

పైథాగరస్‌తో ఎన్నో సమస్యలు పరిష్కరించవచ్చు. టైమ్ క్యాలిక్యులేషన్ జరిగే విధానాన్ని సులువుగా తెలుసుకోవచ్చు.

– పుష్పాంజలి, గైడ్ టీచర్: సంగీత లక్ష్మి, జెడ్పీహెచ్ఎస్, ఆరిపాక

కాలి చెప్పలతో మహిళలకు రక్షణ



మహిళల రక్షణ విషయంలో సమస్యలు ఏర్పడుతున్నాయి. స్వయం రక్షణలో భాగంగా వారికి ఉపయోగపడే పాదరక్షలను తయారు చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. మహిళలు వేసుకునే పాదరక్షలకు సెన్సార్‌తో కూడిన షాకింగ్ పరికరాన్ని అమర్చడం ద్వారా వారు తమను తాము రక్షించుకుంటారు. ఇందులో ఛార్జింగ్ బ్యాటరీ వెనక భాగాన అమరుస్తారు. ఎవరైనా ఇబ్బంది పెట్టినప్పుడు మహిళలు తమ కాలి చెప్పులను ఉపయోగించి రక్షణ పొందవచ్చు.

– ఎంపీఎల్ మేఘన, గైడ్ టీచర్: పి.కళ్యాణి, కేజీబీవీ పాఠశాల, రాంబిల్లి

ఎకో బాటిల్ ఇటుకలు


ప్లాస్టిక్ బాటిల్ బ్రిక్స్ గురించి వివరిస్తున్న విద్యార్థిని

ప్లాస్టిక్ వ్యర్థాలను ప్లాస్టిక్ బాటిల్స్‌లో నింపి వాటిని బాటిల్ బ్రిక్స్‌గా మార్చవచ్చు. వీటిని వివిధ గృహోపకరణాల తయారీకి వినియోగించుకోవచ్చు. కుర్చీలు, తలగడల వంటి వాటిని తయారు చేసుకుని నిత్యజీవితంలో మన్నిక కలిగిన వస్తువులుగా వినియోగించుకోవచ్చు.

– కె.వాసంతి, గైడ్ టీచర్: బీఆర్ఎల్ మల్లీశ్వరి, జెడ్పీహెచ్ఎస్, గుండుపాల, గొలుగొండ మండలం

ఆర్టీసీ బస్ ఢీకొని యువకుడి మృతి


బస్ కింద సాయికుమార్ మృతదేహం

అనకాపల్లి టౌన్: ఆర్టీసీ బస్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్ కథనం మేరకు.. విశాఖ నుంచి అనకాపల్లి వస్తున్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పట్టణంలో దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో అనకాపల్లి మండలం మార్టూరు గ్రామానికి చెందిన కరణం సాయికుమార్ (21) అక్కడికక్కడే మృతి చెందాడు. అతను గాజువాకలో ప్రైవేట్ పరీక్షకు వెళ్లి తిరుగు వస్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు. సాయికుమార్ మేనమామ డి.నర్సింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ప్రణాళికాబద్ధంగా గంజాయి నిర్మూలన

- తప్పించుకు తిరుగుతున్న వారిపై ఉక్కుపాదం
- ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్
- నెలవారీ నేర సమీక్షలో ఎస్పీ గౌతమి సాలి



నెలవారీ నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి సాలి


సాక్షి, అనకాపల్లి: గంజాయి కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న నిందితులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఎస్పీ గౌతమి సాలి ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తీవ్రమైన, సాధారణ, పెండింగ్ కేసులపై సమీక్షించారు. ప్రధానంగా గంజాయి, ఆస్తి వివాదాలు, దొంగతనాల కేసులపై దర్యాప్తును సమీక్షించి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ట్రాఫిక్ జరిమానాలు కూడా వసూలు చేసేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... పూర్తి స్థాయిలో గంజాయి నిర్మూలనకు ప్రణాళికబద్ధంగా పనిచేయాలన్నారు. గంజాయి కేసులో బెయిల్ పై ఉన్న నిందితులు, శిక్ష అనుభవించి జైలు నుంచి విడుదలైన వారిపై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. ఆస్తి దొంగతనాలు నివారించేందుకు రాత్రి, పగలు గస్తీలు ముమ్మరం చేయాలని, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. చెడిపోయిన పాత సీసీ టీవీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. విశాఖ పీడీజే కోర్టు స్పెషల్ పీపీ వై.తారక రామారావు మాట్లాడుతూ.. విధినిర్వహణలో అరెస్టులు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలు తెలియజేసి, 41 ఎ నోటీసు, 448 ఎ ఆర్డర్ గురించి వివరించారు. అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయ భాస్కర్, అదనపు ఎస్పీ (క్రైమ్స్) పి.సత్యనారాయణరావు, నర్సీపట్నం డీఎస్పీ కె.ప్రవీణ్ కుమార్, అనకాపల్లి డీఎస్పీ మళ్ల మహేశ్వరరావు, పరవాడ డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఆర్మ్‌డ్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఆస్తులివే..

మహారాణిపేట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి పలువురు అభ్యర్థులు బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. వారి స్థిర, చర ఆస్తులు, పోలీసు కేసులు, రుణాలు, అప్పుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించారు.

- వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తన పేరిట చరాస్తి రూ.23.58కోట్లు, తన భార్య పేరిట రూ.87.21 లక్షలు, స్థిరాస్తి తన పేరిట రూ.22.41కోట్లు, తన పేరు భార్య పేరున రూ.29.85 కోట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. రుణాలు తన పేరున రూ.4.63 కోట్లు, భార్య పేరిట రూ.1.05 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు. పోలీస్‌స్టేషన్లలో ఎక్కడా కేసులు కాలేదని అఫిడవిట్‌లో తెలిపారు.
- తెలుగుదేశం మద్దతు అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావు తన పేరున చరాస్తి రూ.34.93 లక్షలు, తన భార్య పేరున రూ.87.84 లక్షలు, స్థిరాస్తి తన పేరున రూ.2.41 కోట్లు, భార్య పేరున రూ.2.47 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రుణాలు తన పేరిట రూ.89 లక్షలు, భార్య పేరున రూ.8.03 లక్షలు ఉన్నట్లు వెల్లడించారు. ఎటువంటి నేర చరిత్ర లేదని, కేసులు కూడా నమోదు కాలేదని తెలిపారు.
- బీజేపీ మద్దతు అభ్యర్థి పి.వి.ఎన్ మాధవ్ నగదు రూపంలో రూ.50 వేలు, భార్య వద్ద రూ.25 వేలు, తన పేరున 10 గ్రాముల బంగారం, భార్య పేరున 100 గ్రాముల బంగారం, స్థిర, చర ఆస్తులు కలిపి రూ.3.42 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. రూ.18 లక్షల అప్పులు ఉన్నట్లు తెలిపారు. పలు పోలీసు స్టేషన్లలో పార్టీ పరమైన కార్యక్రమాల సందర్భంగా మూడు కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు.

నూడిల్స్ దుకాణం ఆహుతి


అగ్నికి ఆహుతైన సామాగ్రి, చెక్కబడ్డీ

సాక్షి, పాడేరు: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ సమీపంలోని నూడిల్స్ దుకాణం నడిపే బడ్డీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతి అయింది. మంగళవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. కొత్తల దేవా అనే వ్యాపారి బడ్డీని అద్దెకు తీసుకుని నూడిల్స్ వ్యాపారం చేస్తున్నాడు. మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో దుకాణం మూసి ఇంటికి వెళ్లాడు. ఈ తరువాత బడ్డీకి మంటలు వ్యాపించడంతో స్థానికులంతా ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో మంటలను ఆపే ప్రయత్నం చేశారు. అప్పటికే బడ్డీలోని విలువైన సామాగ్రి అంతా అగ్నికి ఆహుతైంది. గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా ఉబ్బడంతో స్థానికులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న ఫైర్ ఇంజిన్ సిబ్బంది సిలిండర్‌ను బయటకు తీసి అందులోని గ్యాస్‌ను తీసేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు దేవా వాపోయాడు.

నీలగిరి తోటలు దగ్ధం


కాలిపోతున్న తోటలు

రావికమతం: గర్నికం గ్రామానికి చెందిన ఆర్లె వెంకునాయుడు రెండు ఎకరాల నీలగిరి తోట బుధవారం అగ్నికి ఆహుతైంది. దారిన పోయే వారెవరో కాల్చిన సిగరెట్‌ను ఆర్పకుండా పారేయడంతో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆ రైతుకు రూ.లక్ష వరకూ ఆస్తి నష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా. స్థానిక అగ్నిమాపక సిబ్బంది స్పందించి మంటలను అదుపు చేశారు. సమీప తోటలకు అగ్ని కీలలు పాకకుండా నివారించారు.

క్లుప్తంగా

నేడు రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి రోటరీ క్లబ్ 118వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు క్లబ్ చైర్మన్ కడిమిశెట్టి సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు వ్రాస్తున్న గాం.దీనగరం, భీమునిగుమ్మం హైస్కూల్ విద్యార్థులకు పరీక్షలకు కావలసిన వస్తువులు, కన్యకాపరమేశ్వరి దేవాలయం వద్ద అన్నసమారాధన, న్యూకాలనీ రోటరీ క్లబ్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అనకాపల్లిటౌన్ : విద్యుత్ వైర్ల కింద జంగిల్ క్లీనింగ్, పాడైపోయిన ఇనుప స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటు నేపథ్యంలో రింగ్ రోడ్డు లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రమణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ జంక్షన్, రింగ్‌రోడ్డు, పెరుగుబజార్‌రోడ్డు, చిన్నవీధి, చేపలబజారు ఏరియా, నెయ్యిలవీధి, కోట్నివీధి, జీవీఎంసీ కార్యాలయం ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు.

జిల్లా స్థాయి చెస్ పోటీలకు ఎంపికలు



ఎంపికైన చెస్ క్రీడాకారులతో చెస్ అసోషియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్ : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగరం శ్రీ సాయి శక్తి టెక్నోస్కూల్లో జిల్లా స్థాయి అండర్ 11, 13 చెస్ పోటీలకు బుధవారం ఎంపిక ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాల బాలికలను రెండు విభాగాలుగా ఎంపిక చేసినట్టు తెలిపారు. అండర్ 15, 17 కేటగిరీలో ఎంపిక ప్రక్రియ ఈ నెల 26న నర్సీపట్నంలోని నలంద ఇంగ్లిష్ మీడియం స్కూల్లో జరపనున్నట్టు వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీలు వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 7,431 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్	3,700	4,030
మొదటి రకం	3,380	3,630
రెండో రకం	3,030	3,450
మూడోరకం	2,800	3,020

అనకాపల్లి సినిమాలు

సార్	- రాజా
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-1
క్వాంటమేనియా(3డీ)	- సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	-షిర్డిసాయి
క్వాంటమేనియా(3డీ)	-పరిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 80 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు , బీ పాజిటివ్-38 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-25 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 492 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 467 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

వలసలకు 'ఉపాధి'చెక్

- ఉపాధి లక్ష్యం 5,77,799 పనిదినాలు
- 2023-24 సంవత్సరానికి లక్ష్య నిర్దేశం
- సొంతూరిలో ఉపాధితో కూలీల ఆనందం



గ్రామాల్లో చురుగ్గా సాగుతున్న ఉపాధి పనులు



అనకాపల్లి సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలంలో జాబ్ కార్డులు	15,710
ఉపాధి వేతనదారులు	12,749
వెచ్చించనున్న నిధులు	14.84 కోట్లు

అనకాపల్లి రూరల్ : ఉపాధి హామీ పథకం.. కూలీల వలసలు నివారించి ఉన్న ఊరిలోనే జీవనోపాధి కల్పించే బృహత్తర పథకం. కూలీలకు వరంగా ఉన్న ఈ పథకాన్ని వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోంది. అడిగిన ప్రతి ఒక్కరికీ పనులు కల్పించడంతోపాటు వేతనాలను ఎప్పటికప్పుడు కూలీల ఖాతాలకు జమ చేస్తోంది. సొంతూరిలోనే పని దొరుకుతుండడంతో కూలీలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.

జోరందుకున్న ఉపాధి పనులు

మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరందుకున్నాయి. వ్యవసాయ పనుల జోరు తగ్గి వేసవి ఆరంభంకావడంతో వేతనదారులు ఉపాధి పనుల్లో ఎక్కువగా పాల్గొంటున్నారు. ఈ క్రమంలో మండలంలో ఉపాధి పనిదినాల లక్ష్యాన్ని నరేగా అధికారులు నిర్దేశించారు. ప్రస్తుతం ఆ లక్ష్యం దిశగా అడుగులు పడుతున్నాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించి మండలంలో 5 లక్షల 77 వేల 799 పనిదినాలను కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వేసవిలో ఎలాంటి వ్యవసాయ పనులూ వుండవు. ఈ నేపథ్యంలో వేతనదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నారు. వేతనదారులు రెండు పూటలా పనిలో పాల్గొంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పనిచేస్తారు. పనిచేసే వేతనదారుల వద్ద వేసవి ఎండ తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా 500 వరకూ టెంట్లు వున్నాయి. అదేవిధంగా ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచారు.

మండలంలో 15,710 జాబ్‌కార్డులు

మండలంలో 12,479 మంది వేతనదారులున్నారు. వారంతా ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. మండలంలో 15,710 జాబ్‌కార్డులున్నాయి. 2023-24 సంవత్సరంలో వీరందరికీ పని కల్పించడం ద్వారా రూ.14.84 కోట్లు వెచ్చించడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నీటి వనరులు, వాగులు, చెరువుల ఆధునికీకరణ, పంట పొలాల చుట్టూ సరిహద్దులు, అంతర్గతంగా కందకాలు, ఇంకుడు గుంతలు వంటి తవ్వకం పనులు చేపడతారు. జగనన్న పచ్చతోరణం పథకంలో భాగంగా రహదారులకు ఇరువైపులా, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాలు, చెరువు గట్లపైన మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం తదితర పనులు చేస్తారు. రైతుల పొలాల్లో ఉద్యాన, పండ్ల తోటల సాగును ప్రోత్సహించడానికి పనులు కేటాయిస్తారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ల భవనాలు, ప్రహరీలు, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు కూడా చేపడతారు. 100 రోజులు పని కల్పించేందుకు, రోజుకు రూ.250 కూలీ పొందేలా ప్రణాళికలు రూపొందించారు.

కొత్తగా మహిళా మేట్ల పర్యవేక్షణ

ఉపాధి హామీ పథకంలో అవకతవకలు చోటు చేసుకోవడంతో పాత మేట్ల విధానాన్ని రద్దుచేశారు. గతంలో 20 మంది వేతనదారులకు ఒక మేట్ వుండేవాడు. ఆ వ్యక్తికి సంతకం వస్తే చాలు. ప్రస్తుతం ఆ విధానాన్ని రద్దు చేశారు. 40 నుంచి 50 కుటుంబాలకు ఒకరు చొప్పున పదో తరగతి పాస్, లేదా ఫెయిలైన మహిళలను మేట్‌గా ఏర్పాటు చేశారు. వారి పరిధిలో వున్న 50 కుటుంబాలకు సంబంధించి సెల్‌ఫోన్‌లో వేతనదారుల వివరాలు నమోదు చేసి, ఆన్‌లైన్‌లో మస్తరు వేయాల్సి ఉంటుంది. మహిళా మేట్లు అందరికీ మొబైల్ నిర్వహణపై అవగాహన కల్పించారు.

అడిగిన వారందరికీ పనులు



ఉపాధి పథకంలో భాగంగా కూలీల వలసలను నివారించాలన్న ఉద్దేశంతో ఇప్పటికే అన్ని గ్రామాల్లో పనులను గుర్తించాం. గ్రామాల్లో అడిగిన కూలీలందరికీ పనులు కల్పిస్తున్నాం. ఏడాదికి కనీసం 100 రోజుల పని ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. పని చేసే చోట కూడా కొన్ని సదుపాయాలు కల్పించాలని చెప్పాం. మండలంలో వున్న వేతనదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలి. పనుల్లో పారదర్శకత కోసం ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– కె.ధర్మారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, అనకాపల్లి

పట్టభద్రుల ఓటర్ నమోదు తుది గడువు నేడు

అనకాపల్లిటౌన్ : ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటర్ నమోదుకు 23వ తేదీ రాత్రి 12 గంటల వరకు అవకాశముందని 8వ వార్డు సచివాలయం కార్యదర్శి గణేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణీత వ్యవధిలోగా డిగ్రీ పూర్తి చేసిన వారంతా ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సూచించారు.

యోగాతో ఆరోగ్యకర జీవితం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్ : నిత్యం యోగా చేయడంతో ఆరోగ్యంగా జీవించవచ్చని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. స్థానిక ఉప్పల చంద్రశేఖర్ కల్యాణ మండలంలో బ్రహ్మకుమారీస్ 40 వసంతాల వేడుకలను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి వ్యక్తి దైనందిన జీవితంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, ఒత్తిడిని జయించేందుకు బ్రహ్మకుమారీస్ సిద్ధాంతాల ఎంతగానో దోహదపడతాయన్నారు.

బ్రహ్మకుమారీస్ పద్ధతుల్ని అనుసరించడం ద్వారా మానవ జీవనశైలిలో అనేక మార్పులు వస్తాయన్నారు. ఈ సమావేశానికి విశాఖ ఉమ్మడి జిల్లాల బ్రహ్మకుమారీస్ పాల్గొనడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు, రాజయోగి, రాజు, అన్నపూర్ణ, బి.కె.వేణి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలదే భవిష్యత్

కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్



చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాలలో శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి, నాబార్డు ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ చిరుధాన్య మహోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త డాక్టర్ రాజకుమార్ మాట్లాడుతూ రానున్న కాలంలో చిరుధాన్యాలపైనే అందరూ ఆధారపడాల్సి ఉంటుందన్నారు. చిరుధాన్యాల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పూర్తి సహకారం అందుతోందన్నారు. ఆరోగ్యకర జీవనానికి చిరుధాన్యాలు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. చిరుధాన్యాలతో చేసిన వంటలను ప్రోత్సహించాలన్నారు. చిరుధాన్య పదార్థాల తయారీ కోసం ఇస్తున్న శిక్షణను మహిళలు సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. శారదా వ్యాలీ డెవలప్‌మెంట్ సమితి కార్యదర్శి కర్రి జోగినాయుడు మాట్లాడుతూ అనకాపల్లి మండల పరిధిలో ప్రజల జీవనోపాధి పెంపొందించడంలో సంస్థ ఎల్లప్పుడూ సహకరిస్తుందన్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో సుసాగ్ ఆరోగ్య చిరుధాన్యాల బ్యాంకు ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. 15 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణలో దర్జీనగర్, మామిడిపాలెం, ఊడేరు, అనకాపల్లి, తుమ్మపాల, బవులవాడ, పాపయ్యపాలెం, సంతపాలెం, మాకవరం, ఓంద్రం, కుంచంగి గ్రామాల్లోని మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు



గవరపాలెం సంతబయలు వద్ద వీధి కుక్కలను పట్టుకుంటున్న జోనల్ కార్మికులు

అనకాపల్లిటౌన్ : వీధి కుక్కల బారినపడి వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు జోనల్ కమిషనర్ పి.వెంకటరమణ అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై విచ్చలవిడిగా తిరుగుతున్న వీధి కుక్కలను పట్టుకునేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రహదారులపై తిరిగే కుక్కలను పట్టుకుని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయనున్నట్టు పేర్కొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణానికి రక్షణ



హెల్మెట్ ధరించాలని ప్లకార్డుతో సూచిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్

సింహాచలం(పెందుర్తి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, తద్వారా సురక్షిత ప్రయాణం సాగించవచ్చునని పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ ద్విచక్ర వాహనదారులకు సూచించారు. పెందుర్తిలో బుధవారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. 2022లో హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో 147 మంది మృతి చెందారని వివరించారు. చిన్న పొరపాటు జీవితాన్ని అంధకారంలోకి నెట్టివేస్తుందన్నారు. కుటుంబ సభ్యులు కూడా తమ వారికి హెల్మెట్ ధారణ వల్ల కలిగే ప్రయోజనాలు వివరించాలని సూచించారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలతో ఎంతో మేలు



మూలపేటలో ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందిస్తున్న అనిల్‌కుమార్

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రజల ఇంటివద్దకే నేరుగా వైద్యులు వచ్చి ఆరోగ్య వివరాలు తెలుసుకునే మంచి కార్యక్రమం అందుబాటులోకి వచ్చిందన్నారు. డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ సీజన్‌లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

సబ్బవరం:మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణం



మునగపాకలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం

మునగపాక: స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో గురువారం విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, కోశాధికారి వేగి సాయిబునాయుడులు తెలిపారు. శివరాత్రి పర్వదిన వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఉదయం 11.22 గంటలకు వేద పండితులు సోమశేఖర శర్మ ఆధ్వర్యంలో కల్యాణం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు జరుగుతుందన్నారు. గ్రామపెద్దల సహకారంతో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరుతున్నారు.

26న అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు

మునగపాక : ఈ నెల 26న మునగపాకలో అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో వార్షికోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామస్తుల సహకారంతో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మొల్లేటి సత్యనారాయణ, జల్లేపల్లి వెంకట కృష్ణారావు, పెంటకోట సూర్యనారాయణ, మళ్ల జోగారావు, సత్యనారాయణ, కిరణ్, పెంటకోట శ్రీనివాసరావు(నెట్), భీశెట్టి వెంకట్, చిన్న, పరదేశినాయుడు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం:మండలంలోని సబ్బవరం సెక్షన్-2 అంతకాపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గుల్లేపల్లి రూరల్ ఫీడర్‌లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు ఈపీడీసీఎల్ డిప్యూటీ ప్రాజెక్టు ఇంజినీర్ బి.నిరంజన్ అంబేడ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సెక్షన్-2 పరిధిలోని అంతకాపల్లి సబ్‌స్టేషన్-33/11 కేవీతో పాటు గుల్లేపల్లి రూరల్ ఫీడర్-11కేవీ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపోనున్నట్లు పేర్కొన్నారు. గుల్లేపల్లి, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, బోదువలస, ఎల్లుప్పి, అయ్యన్నపాలెం, దుడ్డువాక, కిల్లివానిపాలెం, రాపర్తివానిపాలెం, మర్రిపాలెంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థికి అభినందనలు



రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థి జితేంద్రను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

ఎస్.రాయవరం: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో దార్లపూడి ఉన్నత పాఠశాల విద్యార్థి ద్వితీయస్థానంలో నిలవడం పట్ల ప్రధానోపాధ్యాయులు శాంతి ప్రసూన అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో అండర్ 14 విభాగంలో 9వ తరగతి చదువుచున్న పినపోలు జితేంద్ర విజయం సాధించిన జట్టులో ఉన్నాడన్నారు. గుంటూరు జిల్లా నరసారావు పేటలో జరిగిన క్రీడల్లో ఇటీవల పాల్గొన్నట్టు చెప్పారు. ఈ మేరకు వచ్చిన ధ్రువీకరణపత్రం ప్రధానోపాధ్యాయులు జితేంద్రకు అందజేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

పొగమంచులో..



కశింకోటలోని శారదానది ప్రాంతంలో పొగమంచు వాతావరణం

కశింకోట : కశింకోట ప్రాంతంలో బుధవారం పొగమంచు వాతావరణం నెలకొంది. ఇళ్లు, చెట్లపైన, శారదానదిలోను మంచు ఆవహించింది. ఉదయం 8 గంటల వరకు సూర్యోదయం కానరాలేదు. ఆ తర్వాత సూర్య కిరణాలు రావడంతో మంచు తెరలు క్రమంగా తొలగిపోయాయి. దీంతో పొగమంచు వల్ల దారి కానక ఇబ్బంది పడిన పొలాలకు వెళ్లే రైతులు మంచు తెరలు తొలగిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అలాగే తాళ్లపాలెం ప్రాంతంలో కూడా పొగమంచు ఆవహించింది.

చేపా.. చేపా.. ఎండేదెట్టా!

- శిథిలమైన ప్లాట్‌ఫారం
- ఇబ్బంది పడుతున్న మత్స్యకారులు



తీరంలో శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాలు ప్లాట్‌ఫారం



రోడ్డుపై చేపల్ని ఎండబెడుతున్న మత్స్యకార మహిళలు

పరవాడ: ముత్యాలమ్మపాలెం మత్స్యకారులు వేటాడి తెచ్చిన చిరు చేపలు ఎండబెట్టడానికి అవసరమైన ప్లాట్ ఫారాలు శిథిలం అయ్యాయి. దీంతో ప్రత్యామ్నాయం లేక వారు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి

ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు నిత్యం చేపల వేట సాగిస్తారు. వీరికి వలలకు చిక్కిన చిరు చేపలకు సరైన గిట్టుబాటు ధర లభించక పోతే వాటిని ఎండబెట్టి వివిధ ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయించి సొమ్ము చేసుకుంటారు. అయితే మత్స్యకారులు చిరుచేపలు ఎండ బెట్టడానికి తీరంలో కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాలు ప్లాట్ ఫారం దెబ్బతింది. మరో రెండు ప్లాట్ ఫారాలు కూడా మరమ్మతులకు గురయ్యాయి. అలాగే వలలు, ఇంజిన్లు వేట సామగ్రి భద్రపర్చుకోవడానికి నిర్మించిన కమ్యూనిటీ భవనం కూడా శిథిలావస్థకు చేరింది.

వేధిస్తున్న స్థల సమస్య

ప్లాట్ ఫారాలు శిథిలం కావడంతో ఉన్న ఒకే ప్లాట్ ఫారంపై అంతా చిరు చేపలు ఎండబెట్టడానికి వీలు కాక ఇబ్బందులు పడుతున్నామని మత్స్యకార్మికులు చెబుతున్నారు. ప్లాట్ ఫారాలకు మరమ్మతులు చేయాలని అధికారులకు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని వాపోతున్నారు. వేరే మార్గం లేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా రోడ్లపై చేపలు ఎండబెడుతున్నామని చెప్తున్నారు. ఎండా కాలంలో ఏదో సరిపెట్టుకుంటున్నా.. వర్షాకాలంలో తమ బాధలు వర్ణనాతీతమంటున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న ప్లాట్ ఫారాలను మరమ్మతు చేయాలని మత్స్యకారులు కోరుతున్నారు.

'మ్యాజిక్ బస్' సేవలు అభినందనీయం

మునగపాక : విద్యాభివృద్ధికి మ్యాజిక్ బస్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కొనియాడారు. వాడ్రాపల్లి జెడ్పీ హైస్కూల్లో సంస్థ ద్వారా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బుధవారం ఆయన బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నరాజు, సంస్థ అకడమిక్ ఎడ్యుకేటర్ ఆనంద్ పాల్గొన్నారు.